యాష్ - ట్రే

"అమ్మా! మీ కోసం ఎవరో వచ్చేరు!" కమల గది గుమ్మంలో నిల్చుంది. చికాకు వేసింది. ఆదివారం నాడూ హాయిగా రిలాక్స్ అయి గడపడానికి వీల్లేకుండా ఎవరా వచ్చింది. ఈ మనుష్యులు ప్రాణాలు తోడేస్తున్నారు.

"ఎవరూ? వచ్చినవాళ్ళు ఆడవాళ్లా? మగవాళ్లా"

"మగే!"

"ఒకరేనా? ఇద్దరు ముగ్గురా? పేరూ గట్రా కనుక్కోలేక పోయావా? ఎలా ఉన్నారూ?" తనమొహం మీద చికాకుని విసుగునీ కమల చూసింది. దానికి తెలుసు తన మూడ్ పాడైపోతూందని.

"ఒకాయనేనండీ! ఒడ్డూ పొడుగూ దొరబాబులా ఉన్నాడు." వచ్చినాయన గురించి చెప్పి పేరు కనుక్కోడానికి వెళ్లబోయింది.

ఏముందీ! ఏ స్టూడెంటు తండ్రో, అన్నో అయి ఉంటాడు. ఏ సీటుకోసమో, హాస్టలు గురించో అడగడానికి పొద్దున్నే వచ్చిఉంటాడు. ఆదివారం ఉదయమే తలారా స్నానం చేసి మొదటి కప్పు కాఫీతాగి పడక కుర్చీలో పడుకుని ఇష్టమైన కావ్య పఠనం చేస్తూఉంటే పానకంలో పుడకలా ఎవడో ఈ మహానుభావుడు దొరబాబు వచ్చిపడ్డాడు. ప్రిన్స్‌పాల్ అయి కుర్చీలో కూర్చున్నప్పటినుంచి పోయిట్రీ లేదూ, పాడూలేదు. బ్రతుకులో పోయిట్రీ జావకారిపోయినా తట్టుకుంది కాని, బాధ్యతల మధ్య కనీసం ఆదివారం పూటైనా గొంతెత్తి కవిత్వం చదువుకోడానికి వీల్లేకపోతూ ఉంటే ఎలా చావడం?

"పేరూ అదీ కనుక్కోనక్కర్లేదులే. నేనే వస్తున్నా" అంటూ లేచింది.

పడకగదిలోంచి డ్రాయింగు రూములోకి వెళుతూ వెళుతూ డైనింగు టేబిలుమీద ఫ్లవర్ వేస్‌లో పువ్వులు సరిగ్గా లేనట్టు చూసి ఆగిపోయింది. లేస్తూనే తనే ఆ నల చదరపు వేసుని సర్దింది. కిందికి

పెట్టిన పువ్వు కొమ్మలూ మరీ పొడుగైపోయి అందం పోయింది. ఆ పువ్వునీ కొమ్మల్నీ స్టెమ్ హోల్డరునుంచి తీసి అడుగు భాగాలు తెంచి, మళ్లీ పెట్టింది. చిన్న తేడాతో ఎంత అందం వచ్చింది. నవ్వుకుంది. బ్రతుకూ అంతే. చిన్న చిన్న తేడాలతో చక్కదనాల సొగసుతో నిండనూవచ్చు. ఆ కొద్ది తేడాలు లేకపోతే బోసిపోయి వెలవెలలాడి పోనూవచ్చు. కొందరి చేతులు సొగసు పెంచితే, కొందరి చేతులు మసి చేస్తాయి!

డ్రాయింగ్ రూమ్ కర్టెను ఎత్తి లోపలకి అడుగుపెట్టి బొమ్మలా నిలుచుండిపోయింది. వచ్చిన పెద్దమనిషి నిల్చునే ఉన్నాడు. లిప్తపాటు తత్తరపాటుతో చూసి "మీరా?" అన్నాది. శేఖర్! పదిహేనేళ్లు! ఒకటా రెండా? పూర్తిగా పదిహేను సంవత్సరాల తరవాత చూడ్డం.

"పోల్చుకున్నారే!" అన్నాడు.

ఎందుకు పోల్చుకోలేదూ? నిజమే! పదిహేనేళ్లలో మనిషిలో మార్పు బాగానే వచ్చింది. ఒత్తుగా ఉంగరాల జుత్తుతో క్రాపు ఉండేది. ఇప్పుడు ముందు భాగం అంతా బట్టతలే. మిసమిసలాడే తెలుపు. విదేశంలో ఉండడం నుంచి ఇప్పుడా తెలుపులో మరోవన్నె ఎక్కువగా కనబడుతూంది. అందుకే లిప్తపాటు తత్తరపాటు కాని ఆకళ్లు, తీక్షణమైనకళ్లు, అందమైన కళ్లు, చురుకైన కళ్లు-వాటిని పోల్చుకోలేదూ? ఆ కళ్లని తను ఎప్పుడూ మరిచిపోలేదు.

"కూర్చోండి. నిల్చున్నారేం!" అన్నాది.

తనవేపు రెప్ప వేయకుండా చూస్తున్న ఆ చూపుల్ని తను తట్టుకోలేకపోతూంది. ఆదివారం తల రుద్దుకుని, జుట్టు ఆరుతుందని జడ వేసుకోలేదు. తడిగా ఉన్న జుత్తుని అలాగే వదిలి పెట్టింది. ముడికూడా పెట్టుకోలేదు. మోకాళ్లవరకూ పడుతున్న తన జుట్టునీ, తనని మార్చి మార్చి చూస్తున్నాడు. అనుకోకుండా పమిటని నిండుగా జుట్టుమీద నుంచి కప్పుకుంది.

"మీరు అలాగే ఉన్నారు. ఏం మారలేదు." అన్నాడు. సోఫాలో కూర్చుంటూ. నిజమే. తను ఏమీ మారలేదు. అందరూ అదే అంటారు. నలభయ్యోపడి వచ్చినా జుట్టు ఊడనూ లేదు-నెరవనూ లేదు. ఒళ్లు వచ్చి వికృతంగా బస్తాలా అవనూ లేదు. తన పొడుగుపాటి తెల్లని జుట్టుని చూసి అందరూ అడుగుతారు. "ఒక్క వెంట్రుకన్నా నెరవ లేదు. ఏం నూనె రాసుకుంటారూ?" అంటారు. సన్నగా సలాగ్గా ఆవిడ అప్పటికీ ఇప్పటికీ ఒక్కలా ఉన్నారు. ఎంత చకచకా పనిచేస్తారు! మనం ఆవిడతో పనిచెయ్యలేం" అని తన ముందర తనని పొగుడుతారు. నలభై ఏళ్ళొచ్చినా, తెలియనివాళ్లు తనకి ముప్ఫై ఏళ్లనే అనుకుంటారు:

చిన్నగా నవ్వి ఊరుకుంది. ఈ పెద్దమనిషి దేశానికి ఎప్పుడు తిరిగివచ్చాడో! దేశం వచ్చినవాడు ఈ ఊరు ఎందుకు వచ్చాడో? ఈ ఊరు వచ్చి తనగురించి భోగట్టా చేసి ఇల్లు వెతుక్కుంటూ వచ్చాడా? తనని గుర్తుంచుకున్నాడా? మరిచిపోవడం కష్టమైన సంగతే! అయితే తన ఇంటికి రావడం ఆశ్చర్యమైన విషయమే!

"ముందు ఉత్తరం రాసి వద్దామనుకున్నాను. కాని రాయకుండా వెంటనే బయల్దేరి వచ్చేశాను. బాబులు మీరు ఇక్కడ వుమన్స్ కాలేజీలో ప్రిన్స్‌పాల్‌గా ఉన్నారని, ఇల్లూ అదీ కట్టుకుని ఈ ఊళ్లో సెటిల్ అయ్యారనీ చెప్పాడు. నిన్న రాత్రి ట్రెయిన్‌లో వచ్చాను."

"బాబులు?"

"అదే మన రామశాస్త్రి."

బాబులు అంటే ముందు ఎవరో అనుకుంది. రామశాస్త్రి! అవును. ఆయన్ని 'బాబులు' అని పిలిచేవారు.

"రామశాస్త్రిగారా? ఆయన ఇప్పుడు ఎక్కడుంటున్నారు?"

"బొంబాయిలో ఉన్నాడు. వాడుకూడా నాతోపాటు వస్తాడను కున్నాను. కాని వాడికి వీలు పడలేదు."

రామశాస్త్రి! శేఖర్‌ని తీసుకువచ్చి ఇంట్రడ్యూస్ చేశాడు.

హాండ్‌సమ్ ఇంజనీర్ అంటూ! అమ్మా నాన్నా అన్నయ్య-అంతా శేఖర్ని చూసి మురిసిపోయారు! వాళ్లేనా మురిసిపోయింది? తనో? తనని తానే మరిచిపోయింది.

తరువాత ఆ రామశాస్త్రి ఎక్కడున్నాడో, ఏం చేస్తున్నాడో తను పట్టించుకోలేదు. అవసరం ఏముంది! శేఖర్‌తోపాటు రామశాస్త్రి బ్రతుకులోనుంచి పక్కకి తప్పుకున్నాడు. తను ఎక్కడుందో, ఏంచేస్తోందో, ఆఖరికి ఇల్లుకట్టుకున్న సంగతివరకూ అన్ని భోగట్టాలూ బొంబాయిలో ఉన్న రామశాస్త్రి తెలుసుకున్నాడా! శేఖర్ రామశాస్త్రి దగ్గర భోగట్టా చేసి ఇక్కడికి వచ్చేడా? పదిహేనేళ్ల క్రితం సంగతులు నిన్న మొన్న జరిగిన సంగతుల్లా కళ్లముందు కదులుతూ కనిపిస్తున్నాయి.

"కమలా! ఓ కమలా!" కేకేసింది.

శేఖర్ నవ్వేడు. "మీరు ఏమీ మారలేదు. కమలా! ఓ కమలా! 'ఓ' లేకుండా పిలవడం మీకు రాదుగా"

శేఖర్‌కి అన్నీ జ్ఞాపకం ఉన్నాయి. అన్నయ్య తనని వెక్కిరించేడు. "అన్నయ్యా ఓ అన్నయా!" అంటుందనీ, రేపు పొద్దున్న మిమ్మల్ని "శేఖర్! ఓ శేఖర్!" అనిపిలుస్తుంది సుమండీ"అనివెక్కిరిస్తూ చెప్పేడు. శేఖర్ నవ్వేడు కాని తనకి నవ్వురాలేదు. ఆవిషయం జ్ఞాపకం వచ్చి బాధ అనిపించింది. "శేఖర్ ! ఓ శేఖర్!" అని పిలిచే క్షణం రాలేదు. పెద్దవాళ్ళ భాషలోయోగంలేదు. పదిహేనేళ్లు గడిచిపోయేక, నడివయస్సు పైబడ్డాక శేఖర్ కేవలం పరిచయస్థుడు తప్ప ఏం కాదని ఎరిగాక ఇప్పుడు ఈ బాధ ఏమిటి ? గుండెల్లో ఈబాధ గిలిగింతలో "అమ్మో" అని కొట్టుకుంటూంది.

కమల వచ్చింది.

"రెండు కప్పులు కాఫీ తీసుకురా" అని కమలకి చెప్పింది.

"ఎన్నేళ్ళయిందో మీరు పెట్టిన కాఫీ తాగి ! కమల చేతి కాఫీనా నాకిప్పిస్తారు ?" అన్నాడు శేఖర్.

తను పెట్టిన కాఫీ బ్రహ్మాండమని శేఖర్ తెగమెచ్చుకునేవాడు.

అన్నయ్య స్నేహితులూ తన కాఫీకోసం అలాగే వచ్చేవారు. ఇప్పటికీ తన స్నేహితులు అందరూ "కమల కాఫీకాదు నీకాఫీ కావాలి" అంటూ వంటింట్లో నిలబడి మరీ చేయించుకుంటారు. మీ చేతికాఫీ తాగుతాను అని అంటున్న శేఖర్‌లో పదిహేనేళ్ళ క్రితపు శేఖర్ కనిపించేడు. కాలం ఎంతమార్పు తెస్తుంది! ఆఖరిసారి శేఖర్‌గాని కనిపించి ఉంటే తను కాఫీ ఇచ్చేదా? అప్పుడు ఆక్షణాన్ని శేఖర్ అంటే ఎంత కోపం! అసహ్యం! ఒళ్ళుమంట! ఎంత స్వార్థపరుడు! మాటమీద నిలబడలేని అప్రాప్యుడు! ఎన్ని రకాలుగా అందరూ తిట్టేరు!

ఇప్పుడు పదిహేనేళ్ళ తర్వాత, నలభయ్యోపడిలో, ప్రిన్సిపాల్ హోదాలో, సోషల్ స్టేటస్‌తో ఉన్న తన ఇంటికి వచ్చిన అతిథిని గౌరవించి పంపాలి. ఇన్నేళ్ళ తేడాయే లేకపోతే నిలువునా నిలబెట్టి తిట్టి దులపవలసినదంతా దులిపి పంపించి ఉండేది. ఇప్పుడు ఆ కోపంలేదు. తిట్టడం దుయ్యబెట్టడం మర్యాదకాదు. అవసరమూలేదు.

తనులేచి లోపలికి వెళ్ళబోతూ ఉంటే— "మీ ఇల్లు నేను చూడొచ్చా? డ్రాయింగు రూములోనే కూర్చోవాలా?" అంటూ శేఖర్ లేచి నిల్చున్నాడు.

అమ్మగారింటికి ఎవరూరారు. ఆవిడా, ఆవిడ పుస్తకాలూ, ఆవిడ కాలేజీ, ఆవిడ తోటా మొక్కలూతప్ప ఆవిడికి మరో ప్రపంచంలేదు. అడపాతడపా ఆవిడ అన్నయ్య వస్తాడు. అలాంటిది ఈ పెద్దమనిషి ఎవడో ఇలా మాట్లాడుతున్నాడు! కమల అనుకుని ఉంటుంది. దానికేం తెలుసు? ఈ పెద్దమనిషి అమ్మగారి బ్రతుకులో చిన్న చిచ్చుపెట్టి వెళ్ళిపోయేడని, నాటికి నేడు ప్రత్యక్షమయ్యేడని దానికేం ఎరుక!

"రండి లోపలికి. ఇల్లు చూడనా అని అడుగుతున్నారా? భలేవారే!" అంటూ శేఖర్‌ని తీసుకుని లోపలికి వెళ్ళింది. మంచీ మర్యాదా మొహాన్ని పూత పూసుకుని ఎప్పుడూ అంటి పెట్టుకుని ఉంటాయి. మనస్సులోపల జరిగే మథనకీ మొహంమీద రంగుకీ ఏం సంబంధంలేదు!

తన ఇంటినీ తననీ శేఖర్ చూడవలసిందే. ఒకప్పుడు తనని కాదని తోసిపుచ్చి వెళ్లిపోయినవాడు. చూడనీ, తనకాళ్లమీద తాను నిల్చుని ఏ స్టేటస్‌కి రైజ్ అయిందో ఎంత గొప్పగా బతుకుతుందో చూడనీ! తనవాళ్లకి డబ్బులేక, డబ్బు ఇవ్వలేక పోవడంవల్ల తనని కాదని శేఖర్ చదువుకోని అనాకారిని పట్టుకున్నాడు. చదువుకోని అనాకారి కొంగుని బంగారం ఉంది. దాన్నిపుచ్చుకొని ఇంగ్లండు వెళ్ళేడు. పెద్ద ఇంజనీరై అక్కడే సెటిలయ్యేడని విన్నాది. పెళ్లాంలో దేశంవచ్చి ఉంటాడు. దేశం తిరుగుతూ తిరుగుతూ తన ఇంటికి వేంచేశాడు.

శేఖర్ ఇంగ్లండు వెళ్ళిపోయేక, సంగతి తెలిసేక ఇంట్లో అందరూ శేఖర్ని తిట్టారు. "ఆ మాత్రం మాట నిలకడ లేనివాడు మన మ్మాయిని చేసుకుంటానని మాటెందుకిచ్చాడూ?" అన్నారు. "మన మ్మాయి దగ్గరికి రోజూ సాయంత్రంపూట ఎందుకు హాజరయ్యేవాడూ? అన్నారు. "అంతాడబ్బు. డబ్బులో ఉంది మహాత్మ్యం" అన్నారు. డబ్బేకావాలని సరిగ్గా ఏడిస్తే ఇల్లు అమ్మి అయినా ఇచ్చేవాణ్ణి. పిల్లదాని సుఖం కోసం ఏమన్నా చేసి ఉండేవాణ్ణి! అని నాన్న బుర్ర మొత్తుకున్నారు. కట్నం గట్రాలతో పనిలేదని శేఖర్ని పరిచయం చేసేరు. శేఖరు రంగం ఇలా తేలేసరికి "కాలికి బలపం కట్టుకునీ తిరిగి వాడి తాతలాంటి సంబంధం తేకపోతే చూడు" అని ప్రతిజ్ఞ పట్టేరు. కాని తన మొండి తనం దగ్గర ఎవరిమాటా చెల్లలేదు. ససేమిరా ఇను పెళ్లి చేసుకోను కాక చేసుకోనూ అంది! "వాడంటే అలాంటి అప్రాచ్యుడు. అందరూ అలాంటి వాళ్లటే; " అని తెగ నచ్చచెప్ప బోయేరు. "అదో శిఖండి! ఉండక వదిలెయ్యండి దాని ఖర్మ ఎలావుంటే అలా ఏడుస్తుంది" అని ఓ జోత పెట్టేసేరు. ఇదిగో దాని ఫలితం—తను సంఘంలో తనకి తానుగా, ఓ కళాశాల ప్రిన్స్‌పాలుగా, మంచి వ్యక్తిత్వం ఉన్న చక్కని ఎడ్మినిస్ట్రేటర్‌గా, మంచి మేడమ్‌గా, చుట్టూ ఉన్న వాళ్లకి దయగల తల్లిగా పేరూ ప్రతిష్టా తెచ్చుకుంది? ఇప్పుడు ఇల్లుకూడా కట్టుకుంది?

ముందుకు చక్కనితోట? మంచి లైబ్రరీ: చేతినిండా కావలసినంత పని. తన హితాభిలాషులందరికీ ఆశ్చర్యమే! ఇంత చక్కటి ఆవిడ, ఇంత మంచి మనస్సు కలావిడ, అంత నేర్పుతో ఇంటాబైటా పనిచెయ్యగలిగే ఆవిడ పెళ్లి చేసుకోలేదేమి? అని! "ఆవిడ ఎంచక్కటి గృహిణి అయి ఉండేది. మగవాళ్ల దౌర్భాగ్యులు?" అని వాళ్లలో వాళ్లు తనకి వినిపించేటట్టుగా కూడా వాపోతూ ఉంటారు. చూడనీ శేఖర్ని-తనని, తన ఇంటిని, తన స్టేటస్ని, తనవ్యక్తిత్వాన్ని! పెళ్లి ఒక్కటే ఆడదాని జీవితంలో మహత్తరమైన విషయం కాదనీ, బ్రతుక్కి కావలసినవి అందం, సొగసూ లసే తెలుసుకోనీ: డబ్బే ప్రధానంకాదనీ తెలుసుకోనీ.

డైనింగు రూములో టేబిలు మీదున్న పువ్వుల్ని చూస్తూ శేఖర్ చాలాసేపు నిలుచుండి పోయేడు. "పువ్వుల అమరిక బాగుంది. ఎంతో బాగుంది" అని మెచ్చుకున్నాడు. "ఇకేబానా నేర్చుకున్నారా?" అన్నాడు. పువ్వుల్ని ఎలా అమర్చాలో చెబుతూ చిన్న తేడాలతో ఎంత అందం వస్తుందో తను బోధపరచింది. పొడుగ్గా పొట్టిగా కాడల్ని ఎలా కత్తిరించాలో తెలుసుకోవాలని చెప్పింది.

'నిజమే! మీరు చెప్పింది' అప్పుడప్పుడు బతుకుల్ని కూడా కత్తిరించి మళ్లీ అమర్చుకోవలసి వస్తుంది. వికారంగా ఉన్న బతుకుని కత్తిరించి అందంగా చేసుకోవాలి. అన్నాడు శేఖర్.

ఎందుకలా అన్నాడో!

"ఇది బెడ్రూమ్. ఆ పక్కది గెస్ట్ రూమ్."

"ఇది బెడ్రూమా! రీడింగ్రూమో, లైబ్రరీవో అనండి. చాలా పుస్తకాలు కలెక్టు చేశారే" అంటూ శేఖర్ పుస్తకాల రాక్ చూడ్డం మొదలుపెట్టేడు. నిజమే, తన బెడ్రూమ్నిండా పుస్తకాలే. తను చదువుతూ వదిలిపెట్టిన మోడరన్ పోయిట్రీ ఏంథాలజీని తీసుకుని శేఖరు పడక కుర్చీలో కూర్చున్నాడు.

"మీ ఇల్లు చాలా బాగుంది. మరి కాఫీ ఇస్తారా?" అన్నాడు.

ఎంత మామూలుగా ఎప్పుడూ వస్తూ పోతూ ఉండే స్నేహితుడిలా చనువుగా అడుగుతున్నాడు. జరిగిపోయినదానికీ, తాను ప్రవర్తించిన దానికీ ఎక్కడా సిగ్గుపడుతున్నట్టు లేదు. అయినా ఇన్నేళ్ల తరవాత అప్పటి తన ప్రవర్తనకి క్షమాపణ చెప్పుకుంటాడా?

"ఓ ష్యూర్!" అంటూ తను వంటింట్లోకి వెళ్లిపోయింది.

కాఫీ పెడుతున్నంతసేపూ పాతరోజులే కళ్ళముందు తిరిగాయి. శేఖరుకి బట్టతలైనా అందంగానే ఉన్నాడు. శేఖరంటే తన మనస్సులో ఇంకా బలహీనత ఉందా? అందుకే బట్టతలా అందంగా కనిపిస్తూందేమో! ఛత్! తనకేం బలహీనత! బలహీనతంటూ ఉంటే ఎవణ్నో ఒకణ్ణి కట్టుకుని, పిల్లా పాపా కనుక్కుని సంసారాన్ని ఈడ్చేది. శేఖర్ ఎవడో ఒహడు ఎలా అవుతాడు? శేఖర్ కాబట్టే బలహీనత! మనస్సు ఎదురు సమాధానం చెబుతుంది.

శేఖర్ పెళ్లాం ఎలా ఉందో? పెళ్లాన్ని కూడా తీసుకువస్తే తను చూసి ఉండేది. పిల్లాపాపా ఉండి ఉంటారు. దేశం ఎప్పుడు వచ్చాడో? ఎన్నాళ్ళు ఉంటాడో? శేఖర్ని తను ఏమీ అడగలేదు.

కాఫీ తీసుకుని తను వెళ్లేసరికి కళ్ళు మూసుకుని పడుకుని ఉన్నాడు. పుస్తకం గుండెల మీద ఉంది. తను వచ్చిన చడి విని కళ్లు విప్పేడు, కళ్లు చెమర్చి ఉన్నాయి. శేఖర్ బాధపడుతున్నాడన్నమాట! "నో గ్రీవెన్సెస్ ఫర్ ది పాస్ట్!" అని చెప్పాలనిపించింది. మాట్లాడకుండానే కాఫీ తాగాడు. తనూ మాట్లాడకుండా నిశ్శబ్దంగా మధ్య మధ్య శేఖర్ వేపు చూస్తూ కాఫీ తాగింది. తను చేసిన కాఫీని ఎంజాయ్ చెయ్యవలసినంతా ఎంజాయ్ చేసేడా? జేబులోంచి సిగరెట్టు తీసి "విత్ యువర్ పెర్మిషన్" అన్నాడు. చిన్నగా బుర్ర ఊపింది. పదిహేనేళ్ళ క్రితపు సంభాషణే!

"యాష్‌ట్రే లేదూ?" అటూ ఇటూచూసి అడిగేడు.

"యాష్-ట్రే కొనవలసిన అవసరం రాలేదు!" అన్నాది.

"సిగరెట్లు తెగకాలుస్తూ ఉంటే - ఇహ తప్పేటట్లు లేదు. ఓయాష్-ట్రే కొనాలి" అన్నాది. ఇంట్లో అన్నయ్యా కాల్చేడు. నాన్నా కాల్చరు.

"మరి తొందరగా కొనేసేయండి!" అన్నాడు, పదిహేనేళ్ల క్రితపు సంభాషణ!

శేఖర్ తనవేపు చూసేడు. ఏమనుకున్నాడో ఏమో ముట్టించిన సిగరెట్టుని నలిపి ఆర్పేశాడు.

"మీరు నాతోపాటు ఓసారి గెస్ట్‌హౌస్‌కి రావాలి. వస్తారా?"

"గెస్ట్‌హౌసా?"

"గెస్ట్‌హౌస్‌లో దిగేం. మీరు నాతో రావాలి."

"ఫామిలీతో వచ్చారా? అయితే అందర్నీ తీసుకు రాలేదేం!" అడిగింది.

"ముందు తీసుకువద్దామనే అనుకున్నాను. కాని ఇన్నేళ్ల తరవాత కలుస్తున్నాంకదా అని తటపటాయించాను. మిమ్మల్ని తీసుకు వెళ్దామని అనిపించింది."

తను వెళ్లాలా? అక్కర్లేదా? రాను అని బ్లంట్‌గా ఎలా చెబుతుంది? ఏం చెప్పి ఎలా తప్పించుకుంటుందీ? తీరా వెళ్తే ఆ భార్య ఎలా బిహేవ్ చేస్తుందో? భార్యతో ఏమని చెప్పేడో? తిన్నగా ఇక్కడికి తీసుకువచ్చి పరిచయంచేస్తే బాగుండేది కదా! తప్పదు! వెళ్లాలి! వెళ్లి చూడాలి! చూడాలన్న కోరికా మనస్సుకి గట్టిగానే ఉంది గెస్ట్‌హౌస్‌కి వెళ్లింది.

"రండి. ఈ రూములో దిగేం" అంటూ లోపలికి తీసుకువెళ్లాడు. గదిలో ఎవరూ లేరు. మంచం మీద రెండేళ్ల పిల్లవాడు నిద్రపోతున్నాడు. మంచం దగ్గరికి వెళ్లి పిల్లవాణ్ణి చూస్తూ నిల్చుంది. పిల్లవాడు బొద్దుగా అందంగా ఉన్నాడు. ఉంగరాల జుత్తు. తండ్రి పోలికే. నిద్దట్లో నవ్వుతున్నాడు. శేఖర్ వేపు తిరిగింది. శేఖర్ తనవేపే చూస్తున్నాడు

"కూర్చోండి"

మంచం పక్కనే ఉన్న కుర్చీలో కూర్చుని అటూ ఇటూ చూసింది. ఇంకెవరూ ఎక్కడా ఉన్న సడిలేదు.

"బాబు మదరేరీ?"

"బాబుకి ఫాదరూ, మదరూ నేనే!"

"వ్వాట్?" అని శేఖర్ వేపు చూస్తూ ఉండిపోయింది.

"తల్లిని చంపి వాడుపుట్టేడు"

ఆ పసివాడు హాయిగా, నిశ్చింతంగా నిద్రపోతున్నాడు. పూర్తిగా దేశం వచ్చేసినట్టూ జాబ్‌లో ప్రవేశించినట్టూ, పిల్లవాణ్ణి పెంచడానికి ఎవరికీ ఇవ్వడం తనకిష్టం లేనట్టూ, మనస్సులో కొట్టుమిట్టులాడి కొట్టుమిట్టులాడి రామశాస్త్రి దగ్గరికి వెళ్లినట్టూ, రామశాస్త్రి ద్వారా తన ఎడ్రసు కనుక్కువచ్చినట్టూ చెప్పేడు.

అంతా చెప్పి ఆఖరికి—"యాష్-ట్రే తొందరలో కొంటారా?" అన్నాడు.

తను శేఖరువేపూ మంచంమీద పడుకుని నిశ్చింతంగా నిద్రపోతున్న పిల్లవాడివేపూ మార్చి మార్చి చూస్తూ ఉండిపోయింది,

శేఖరు శేఖరే! ఎన్ని సంవత్సరాలైనా శేఖరు శేఖరే! తను నిర్ణయం చెయ్యవలసిన క్షణం మరోసారి బ్రతుకులో వచ్చింది. ఈ నిర్ణయంతో బ్రతుకు మళ్లీ మరో మలుపు తిరుగుతుంది. ఈ తిరిగే మలుపు నడికాలంలో అందమైన మలుపే అవుతుందా? శేఖరు శేఖరే! ఎన్నాళ్లయినా శేఖరు శేఖరే!

ఓ నిమిషం, రెండు నిమిషాలు, మూడు నిమిషాలు, ఐదు నిముషాలు.... శేఖరు తనవేపే చూస్తున్నాడు.

"ఐయామ్ సారీ శేఖర్! నా ఇల్లు చాలా చిన్నది. యాష్-ట్రే పెట్టడానికి జాగా లేదు!" అన్నాది.